


# నల్లగొండ సత్యనిష్ఠ

నల్లగొండ-సూర్యాపేట-యాదాద్రి భువనగిరి

21 శుక్రవారం ఆగస్టు 2026 పేజీలు: 3


## హైదరాబాదులో 33 జిల్లాల సమావేశం



**ఎస్ ఇ ఆర్ టి డైరెక్టర్ నికోలాస్**

**నల్లగొండ-ఆగస్టు 20(సత్య నిష్ఠ)**

డిస్ఇ హైదరాబాద్ నందు స్కూల్ గేమ్స్ 33 జిల్లాల సమావేశం ఎస్ ఇ ఆర్ టి డైరెక్టర్ నికోలస్ జాయింట్ డైరెక్టర్ ఉషారాణి నిర్వహించడం జరిగినది. ఈ సమావేశం నందు దగ్గుపాటి విమల నల్గొండ సెక్రటరీ 2024-2026 సంవ త్ రం పూర్తి చేసుకొని ఫారిన్ సర్వీసు నందు లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఒహెల్త్ ఎడ్యుకేషన్ నల్గొండ జిల్లా డైట్ నల్గొండ నందు జాయిన్ అయిన సందర్భము గా సన్మానం చేస్తున్న దృశ్యం. అభినందనలు అందరూ స్కూల్ గేమ్స్ సెక్రటరీలు ఒ స్టేట్ గేమ్స్ సిబ్బంది అభినందనలు తెలిపారు అందరికీ దగ్గుపాటి విమల కృతజ్ఞతలు తెలిపారు.

# ఎల్లాపురంలో రోడ్డు పనులకు శంకుస్థాపన

- **మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి**

**సూర్యాపేట (సత్యనిష్ఠ స్టేట్ బ్యూరో గౌస్)**



హుజూర్‌నగర్ నియోజకవర్గంలో పాలకవీడు మండల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సాగు, తాగునీటితో పాటు రహదారులు, విద్య, వైద్య రంగాల్లో మౌలిక వసతులను బలోపేతం చేస్తున్నట్లు చెప్పారు. పాలకవీడు మండల కేంద్రంలో రూ. 1.43 కోట్లతో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పాలకవీడు ప్రజలపై తనకు ప్రత్యేక అభిమానం ఉందని, అందుకే మండలానికి అభివృద్ధి పనుల్లో ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు.

రూ. 600 కోట్లతో చేపట్టిన జవహర్ జాన్‌పహాడ్ లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తయితే సుమారు 10 వేల ఎకరాల భూములకు సాగునీరు అందుతుందని మంత్రి తెలిపారు. ఈ ప్రాజెక్టుతో వ్యవసాయ రంగానికి మరింత ఊతం లభిస్తుందని చెప్పారు.

**ఇళ్ల కేటాయింపులో పారదర్శకత**

హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రెండు విడతల్లో 5 వేల ఇళు మంజూరయ్యాయని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రతి బూత్‌కు 15 ఇళ్ల చొప్పున కేటాయించేలా చర్యలు తీసుకుంటు న్నామని చెప్పారు. ఇళ్లు అవసరం లేని ప్రాంతాల్లోని కోటాను అవసరం ఉన్న ప్రాంతాలకు మళ్లిస్తామని స్పష్టం చేశారు.

ఎనిమిది నెలల్లో రోడ్డు పూర్తి గుడుగుంట్లపాలెం--సింగారం--ఎల్లాపురం స్టేజీ వరకు 8 కిలోమీటర్ల రహదారి అభివృద్ధికి రూ. 18 కోట్లతో చేపట్టే పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. రెండు కిలోమీటర్లు సీసీ రోడ్డు, ఆరు కిలోమీటర్లు డాంబర్ డబుల్ రోడ్డుగా నిర్మించనున్నట్లు తెలిపారు. పనులను ఎనిమిది నెలల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఎల్లాపురం అభివృద్ధికి కట్టుబడి ఉన్నానని, ఇప్పటికే రూ. 3.20 కోట్లతో సబ్‌స్టేషన్ పనులు ప్రారంభించామని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో హుజూర్‌నగర్ ఆర్డీఓ శ్రీనివాసులు, కోదాడ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంహెచ్ఓ పెండెం వెంకటరమణ, పంచాయతీరాజ్ ఈఈ వెంకటయ్య, ఆర్‌అండ్‌బీ ఈఈ సీతారామయ్య, పంచాయతీ రాజ్ డీఈ వెంకటేశ్వర్లు, ఆర్‌అండ్‌బీ డీఈ రమేష్, నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ కొనతం చిన్న వెంకటరెడ్డి, సర్పంచులు సుజాత, పెరుమాళ్ల సురేష్, తహసీల్దార్ వాజిద్ అలీ, ఎంపీడీఓ లక్ష్మి, పీహెచ్‌సీ డాక్టర్ నాగిని, మండల పార్టీ అధ్యక్షుడు ఎన్.వి.సుబ్బారావు, జిల్లా కార్యదర్శి మాలోత్ మోతిలాల్, బెల్లంకొండ నరసింహారావు, నాగిరెడ్డి, జితేంద ర్‌రెడ్డి, డెక్కన్ సిమెంట్ పరిశ్రమ సీఏజీఎం నాగమల్లేశ్వర రావు, శశిరెడ్డి, వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు మరియు ఎల్లాపురం ఉపసర్పంచ్ చాందిని అజీమ్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దు చేయాలని ధర్నా పోస్టుల ఆవిష్కరణ




**కోదాడ - ఆగస్టు 20 (సత్యనిష్ట)** తెలంగాణ రాష్ట్రంలో సిపిఎస్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, పాత పద్ధతి లో ప్రభుత్వ ఉద్యోగు లకు పింఛన్ అమలు చేయాలని కోరుతూ ఈనెల 23న హైదరాబాదులో నిర్వహించే మహా ధర్నాను విజయ వంతం చేయాలని కోరుతూ సిపిఎస్ ఉద్యోగులు గురువారం నడిగూడెం మండల పరిషత్ కార్యాలయం ఎదుట పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీధర్, కృష్ణ , మహేష్ , ఈశ్వర్ నాగరాజు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, రజిత, తేజస్విని, సుజాత, రెవెన్యూ , పంచాయతీ రాజ్ మరియు ఇతర డిపార్ట్మెంట్ల ఉద్యోగులు పాల్గొన్నారు.

# గాలి రమేష్ నాయుడు ఆశయాలు సాధిస్తాం

- **వర్ధంతి రోజు సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయం**

**కోదాడ-ఆగస్టు 20 (సత్యనిష్ట):** గాలి రమేష్ నాయుడు 37వ వర్ధంతి సందర్భంగా బిసి విద్యార్థి సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ ఆధ్వర్యంలో గురువారం కోదాడ లోని బాయ్స్ హైస్కూల్ విద్యార్థు లకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ఎంఈఓ సలీం షరీఫ్ ముఖ్య అతిథిగా హాజరై పెన్నులు ప్యాడ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్గీయ గాలి రమేష్ నాయుడు వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ఫ్యాడ్లు, పెన్నులు పంపిణీ చేయడం అభినందనీయమని అన్నారు. బీసీ విద్యార్థి జాతీయ ప్రధాన కార్యదర్శి పచ్చిపాల రామకృష్ణ యాదవ్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి నలుగురికి సహాయం చేసే గుణాన్ని గాలి రమేష్ నాయుడు అలవర్చుకున్నారని అన్నారు, ఎన్ఎస్‌యుఐ విద్యార్థి



సంఘంలో పని చేసి ఎంతో మంది విద్యార్థులకు సహాయం చేశారని విద్యార్థి ఉద్యమాలలో చురుగ్గా పాల్గొనే వారని, ఆయన ఆశయ సాధన కోసం సామాజిక సేవా కార్యక్రమాలు కొనసాగిస్తా మని తెలిపారు. ఈ కార్యక్రమం లో గాలి రమేష్ నాయుడు, మిత్రమండలి అధ్యక్షుడు ఎస్కే షఫీ , ఎస్టీ సెల్ ఉపాధ్యక్షులు బర్మావత్ సీతారాం సింగ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి న్యాయవాది గాలి శ్రీనివాస్ నాయుడు, న్యాయవాది చింతలపాటి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## బాణాల బర్తడే దినోత్సవం



**కోదాడ - ఆగస్టు 20 (సత్యనిష్ఠ):** నడిగూడెం మండలంలోని కాగిత రామచంద్రపురం గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బాణాల అబ్రహం పుట్టిన రోజు వేడుక ఆయన నివాసంలో ఘనంగా జరిగింది. అబ్రహాము ను, గ్రామ ఉప సర్పంచ్ దోసపాటి రవి ప్రమీల ఆశీర్వదించి మాట్లాడు తూ ఇలాంటి పుట్టిన రోజు కార్యక్రమాలు మరెన్నో జరుపు కోవాలని నిండు 1000 ఏళ్లు సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమం కన్వీనర్ రెంటాల శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వ హించారు. ఈ యొక్క కార్యక్రమం లో బంధుమిత్రులు, శ్రేయోభిలాషు లు, కుటుంబ సభ్యులు కళా అబ్రహం, భాగ్య లక్ష్మి , కొత్తపల్లి సాయి భరత్ (పండు), ఈ ప్రవీణ్, శ్రీను, శ్రీలత, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ఎడమ కాలువకు త్రాగునీరు వెంటనే విడుదల చేయాలి

- బిఆర్ఎస్ ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతు సందీప్ నాయక్



సత్యనిష్ఠ ఆర్ సి హుజూర్నగర్

సాగర్ నీటిని వెంటనే విడుదల చెయ్యాలి అని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు గుగులోతు సందీప్ నాయక్ గార కుంట తండా గ్రామ శాఖ అధ్యక్షులు నరేందర్ నాయక్ ఆధ్వర్యంలో గ్రామ రైతులతో కలిసి గురువారం స్థానిక తాసిల్దార్ ప్రవంతి కి వినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగర్ ఎడమ కాలువ కింద ఈ ప్రాంత గ్రామాలలో తాగునీటి కొరకు నీటిని విడుదల చేసి చెరువులు నింపాలనిపశు వుల కొరకు తాగునీటిని వెంటనే విడుదల చేయాలని గారకుంట తండ గ్రామ రైతులుతో కలిసి వినతి పత్రం ఇచ్చారు అదేవిధంగా ఈ ప్రాంత రైతుల సౌకర్యార్థం కొరకు నెలకు పది టీఎంసీలు చొప్పున మూడు నెలల పాటు 30 టీఎంసీలు సాగర్ ఎడమ కాలువ కింద విడుదల చేయాలని వారు అన్నారు సాగర్ ఎడమ కాలువ కింద త్రాగునీరు ఇవ్వని పక్షంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘ ఆధ్వర్యంలో అనేక రకమైన ధర్నాలు రాస్తారోకలు నిర్వహించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేసి అసెంబ్లీ కూడా ముట్టడి చేస్తామని వారు అన్నారు తక్షణమే సాగర్ ఎడమ కాలువ కింద త్రాగునీటి అవసరాల కొరకు నీటిని విడుదల చేయాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో గార కుంట తండా గ్రామ శాఖ అధ్యక్షులు నరేందర్ నాయక్ మాజీ నీటి సంఘం డైరెక్టర్ వెంకట్రాం నాయక్ గ్రామ రైతులు పుల్ సింగ్ నాయక్ గాయకుడు నరసింహలాలు నాయక్ రత్తి రామ్ నాయక్ సైదా నాయక్ లింగ నాయక్ కాలా నాయక్ మహిళా రైతులు మంగతి నాగమ్మ వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు

## ఎడమ కాల్వ ద్వారా నీటిని విడుదల చేసి పంటలు కాపాడాలి

- **ములకలపల్లి రాములు డిమాండ్**



**కోదాడ - ఆగస్టు 20 (సత్యనిష్ఠ):** నాగార్జున సాగర్ ఎడమ కాల్వ ద్వారా వెంటనే నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలు నింపి పంట పొలాలను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ములకల పల్లి రాములు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సుందరయ్య భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాగర్ లో నీటి మట్టం రోజు రోజుకు పెరుగు తున్నందున, పెరిగిన నీటిని దృష్టిలో ఉంచు కొని ప్రస్తుతం 530 అడుగుల నీరు ఉన్నందున ప్రభుత్వం వెంటనే నీటిని విడుదలకు చర్యలు తీసు కోవాలని చేసి పంటలను కాపాడటం తో పాటు లిఫ్ట ద్వారా చెరువులు కుంటలు నింపి ప్రజల యొక్క దాహార్తిని తీర్చాలని రాములు డిమాండ్ చేశారు. జిల్లా వ్యాప్తంగా హుజూర్నగర్, కోదాడ ప్రాంతాల్లో వేలాది ఎకరాలు వరి సాగులో ఉందని వేసిన నాట్లు ఎండి పోతున్నాయని రైతాంగం అంత ఆందోళన చెందు తున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రాతి పదికన నీటిని విడుదల చేసి చివరి ఆయకట్టు వరకు నీరు అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అట్లాగే జిల్లాలో తీవ్ర మైన వర్షాభావ పరిస్థితి ఏర్పడ్డాయని నాగార్జున సాగర్ ఆయకట్టు ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. నాగార్జున సాగర్ ఎడమ కాలవల ద్వారా చెరువులు కుంటలు నింపటం ద్వారా భూగర్భ జలాలు పెరిగి గ్రామాల్లో మంచి నీటి సమస్య పరిష్కారం అవుతుందని ఆయన అన్నారు. ఈ యొక్క విలేకరుల సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వర రావు, సిఐటియు జిల్లా అధ్యక్షులు కోటగిరి వెంకట్ నారాయణ, సిపిఎం పట్టణ కార్యదర్శి ఎం ముత్యాలు, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు షేక్ సైదా తదితరులు పాల్గొన్నారు.

## బెతేల్ సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ట్యూషన్ విద్యార్థులకు ప్లేట్ల పంపిణీ

- **చదువుతో పాటు ఉచిత భోజనం అందించడం అభినందనీయం**



**మఠంపల్లి-సత్యనిష్ఠ**

గ్రామీణ ప్రాంతాల్లోని పేద, మధ్యతరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సరైన పోషకాహారాన్ని అందించాలనే ఉన్నతమైన లక్ష్యంతో బెతేల్ సంస్థ పనిచేస్తోంది. సంస్థ నిర్వహిస్తున్న 'ఆఫ్టర్ స్కూల్ ప్రోగ్రామ్' ద్వారా ప్రతీ రోజూ 30 మంది విద్యార్థులకు ఉచితంగా ట్యూషన్ బోధించడంతో పాటు పౌష్టికాహారాన్ని భోజనంగా అందిస్తూ వారి భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తున్నారు. ఈ సేవల్లో భాగంగా ఈరోజు బెతేల్ సంస్థ ప్రాంగణంలో విద్యార్థులకు ఉచితంగా ప్లేట్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సరంపేట గ్రామ సర్పంచ్ నక్క రాములమ్మ రవి మాట్లాడుతూ, పాఠశాల సమయం ముగిసిన తర్వాత పిల్లలు దారి తప్పకుండా, వారి చదువులో వెనుకబడకుండా బెతేల్ సంస్థ అందిస్తున్న ట్యూషన్ ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. విద్యతో పాటు రోజూ 30 మందికి భోజనం పెట్టడం గొప్ప విషయమని, సంస్థ ప్రతినిధులను, నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన ప్రత్యేకంగా అభినందించారు. గ్రామ ప్రజలు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయు లు, ప్రజాప్రతినిధులు గ్రామ సర్పంచ్ నక్క రాములమ్మ రవి, వార్డు మెంబెర్స్ నక్క యాదయ్య, రావుల రాజు,యూత్ సభ్యులు మహేష్,తల్లిదండ్రులు కరుణాకర్, నర్సింహ,బోధనా సిబ్బంది సుధీర్, అనూష, వెంకటమ్మ, రవీందర్ పిల్లలకు విద్యాబుద్ధులు నేర్పించడమే కాకుండా వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్న బెతేల్ సంస్థ నిర్వాహకులకు, ఉపాధ్యాయులకు విద్యార్థుల తల్లిదండ్రులు గ్రామస్తులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

## కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ఒక న్యాయమా? అగ్రకులాలకు ఒక న్యాయమా?

- **బీసీ మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీస్ ఇవ్వడపి సరి కాదు**
- **బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్**



**నల్లగొండ /హైదరాబాద్-ఆగస్టు 20 (సత్య నిష్ఠ):** బీసీ మంత్రి కొండా సురేఖకు కాంగ్రెస్ పార్టీ షోకాజ్ నోటీస్ ఇవ్వడంపై బీసీ జేపీసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగం గౌడ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీల విషయంలో ఒక న్యాయం,అగ్రకులాల విషయంలో మరో న్యాయం అన్నట్లుగా కాంగ్రెస్ పార్టీ వ్యవహరి ంచడం సరికాదని ఆయన మండిపడ్డారు. మంత్రి కొండా సురేఖ కూతురు సుస్మిత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి ఒక వ్యాఖ్య చేసిన నేపథ్యంలో మంత్రి కొండా సురేఖకు షోకాజ్ నోటీస్ ఇవ్వడం ఎంతవరకు సమంజసమని జాజుల లింగం గౌడ్ ప్రశ్నించారు. అదే సమయంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తరచూ వ్యాఖ్యలు చేస్తున్నారని,అలాంటప్పుడు వాళ్ళ అన్న అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారా అని ప్రశ్నించారు.అలాంటప్పుడు వారికి ఎందుకు ఇలాంటి షోకాజ్ నోటీసులు ఇవ్వడం లేదో కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీలో బీసీలకు ఒక న్యాయమా? అగ్రకులాలకు ఒక న్యాయమా? అని జాజుల లింగం గౌడ్ ప్రశ్నించారు. పార్టీ అంతర్గత వ్యవహారాల్లో కూడా సామాజిక న్యాయం, సమానత్వం పాటించాల్సిన అవసరం ఉందన్నారు.బీసీ మంత్రి కొండా సురేఖకు ఇచ్చిన షోకాజ్ నోటీసును వెంటనే వెనక్కి తీసుకోవాలని లింగంగౌడ్ డిమాండ్ చేశారు.

# ఏనుగు నర్సిరెడ్డికి కన్నీటి వీడ్కోలు





- భజనలు.. కోలాటాలు.. డప్పు వాయిద్యాల మధ్య అంతిమయాత్ర
- కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పిన బంధువులు, శ్రేయోభిలాషులు
- ప్రజాసేవలో ప్రత్యేక ముద్ర వేసిన మాజీ సర్పంచ్‌ను కాదు
- తమలో ఒకరిని కోల్పోయామంటూ కన్నీరుమున్నీరైన గ్రామస్థులు

**నల్లగొండ జిల్లా, ఆగస్టు 20 (సత్య నిష్ఠ)**

నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలం ఎర్రగడ్డగూడెం గ్రామ మాజీ సర్పంచ్ ఏనుగు నర్సిరెడ్డి మృతి గ్రామంలో తీవ్ర విషాదాన్ని నింపింది. ఎంతో ఆప్యాయంగా పలకరించే వ్యక్తి ఇక లేరనే విషయాన్ని జీర్ణించుకోలేక గ్రామస్థులు, బంధువులు, స్నేహితులు, అభిమానులు కన్నీరుమున్నీరయ్యారు. బుధవారం నిర్వహించిన ఆయన అంతిమయాత్రలో పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొని భావోద్వేగంతో తుది వీడ్కోలు పలికారు.

భజనలు, కోలాటాలు, డప్పు వాయిద్యాల నడుమ సాగిన అంతిమయాత్ర గ్రామమంతా విషాదంలో ముంచెత్తింది. గ్రామ వీధులన్నీ ప్రజలతో నిండిపోగా, ప్రతి ఒక్కరి కళ్లలోనూ నర్సిరెడ్డిపై ఉన్న అభిమానానికి నిదర్శనంగా కన్నీళ్లు కనిపించాయి. చివరిసారిగా తమ ఆత్మీయుడిని చూసేందుకు చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్‌గా పనిచేసిన కాలంలో ఏనుగు నర్సిరెడ్డి గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి అంకితభావంతో సేవలందించారు. ప్రజలు ఎదుర్కొనే ప్రతి సమస్యను తన సమస్యగా భావించి పరిష్కారానికి నిరంతరం కృషి చేశారు. పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజలకు అందుబాటులో ఉండడం, ఎవరు సహాయం కోరినా ఆదుకోవడం ఆయన ప్రత్యేకతగా నిలిచింది. సర్పంచ్ పదవి ముగిసిన తర్వాత కూడా ప్రజలతో ఉన్న అనుబంధాన్ని కొనసాగిస్తూ తనను ఆశ్రయించిన ప్రతి ఒక్కరికీ తనవంతు సహాయం అందిస్తూ గ్రామానికి ఆత్మీయ నాయకుడిగా నిలిచారు. కులం, మతం, వర్గం, ఆర్థిక స్థితి అనే భేదాలు లేకుండా అందరినీ సమానంగా గౌరవిస్తూ, చిన్నా--పెద్దా అనే తేడా లేకుండా ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు తెలుసుకునే వ్యక్తిగా పేరు సంపాదించారు. ఎవరిని కలిసినా బంధువుల్లా పలకరించే ఆయన స్వభావం గ్రామస్థుల హృదయాల్లో చెరగని ముద్ర వేసింది. అందుకే గ్రామ ప్రజలు ఆయనను కేవలం మాజీ సర్పంచ్‌గా కాకుండా ప్రతి కుటుంబంలో ఒక సభ్యుడిగా, ఆత్మీయుడిగా భావించేవారు. గ్రామంలో ఎవరి ఇంట్లో కష్టం వచ్చినా ముందుండి అండగా నిలవడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు ధైర్యం చెప్పడం, అవసరమైనప్పుడు ఆర్థికంగా, సామాజికంగా సహాయం చేయడం, సమస్య ఏదైనా తనవంతు పరిష్కారానికి కృషి చేయడం ఆయన జీవితంలో భాగమైందని గ్రామస్థులు కన్నీటితో గుర్తు చేసుకున్నారు. "ఆయన చెప్పిన ఆప్యాయమైన మాటలు, ఇచ్చిన భరోసా ఇక వినిపించవనే ఆలోచనే భరించలేకపోతున్నాం. నర్సిరెడ్డి మృతితో గ్రామం ఒక నాయకుడినే కాదు... తమ కష్టసుఖాల్లో తోడుగా నిలిచిన కుటుంబ సభ్యుడిని కోల్పోయింది" అని పలువురు గ్రామస్థులు భావోద్వేగంతో పేర్కొన్నారు. అంతిమయాత్రలో పాల్గొన్న పలువురి కళ్లలో కన్నీళ్లు ఆగలేదు. గ్రామ వీధులన్నీ విషాద ఛాయలు అలుముకోగా, భౌతికంగా నర్సిరెడ్డి దూరమైనప్పటికీ ఆయన చేసిన సేవలు, పంచిన ప్రేమ, చూపిన మానవత్వం ఎర్రగడ్డగూడెం ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతాయని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు బంధువులు, మిత్రులు, శ్రేయోభిలాషులు ధైర్యం చెప్పారు. నర్సిరెడ్డి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ అంతిమయాత్రలో గ్రామస్థులు, బంధువులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులతో పాటు నల్లగొండ మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొని నర్సిరెడ్డికి ఘనంగా నివాళులర్పించారు.



## బస్వాపురం ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి నిధులు విడుదల చేయాలి

- ప్రాజెక్టులో ఉన్న నీటిని విడుదల చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి
- పెండింగ్ లో ఉన్న ప్రాజెక్టుల నిర్మాణం కోసం సీపీఎం ఆధ్వర్యంలో పాదయాత్ర
- మహాధర్నాను జయప్రదం చేయండి
- సీపీఎం రాష్ట్ర కమిటీ కొండమడుగు నర్సింహ్మా

**భువనగిరి–ఆగస్టు 20 (సత్య నిష్ఠ )**

బస్వాపురం ప్రాజెక్టు పూర్తిస్థాయి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వము తక్షణం పూర్తిస్థాయిలో నిధులు కేటాయించి విడుదల చేసి పూర్తిచేయాలని, ప్రాజెక్టులో ప్రస్తుతం ఉన్న నీటిని విడుదల చేసి వర్షాభావ పరిస్థితులలో ఎండిపోతున్న వరి పోలాలకు నీరు అందించి రైతాంగాన్ని ఆదుకోవాలి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ్మా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి మండల పరిధిలోని ముత్తిరెడ్డిగూడెం సీపీఎం గ్రామ శాఖ సమావేశం కొండ హైమావతి అధ్యక్షతన జరగగా ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా నర్సింహ హాజరై మాట్లాడుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వ్యాప్తంగా బీడుబడ్డ భూములను సాగులోకి తేవాలన్నా, వ్యవసాయ మీద ఆధారపడ్డ రైతులకు, వ్యవసాయ కూలీలకు, వృత్తిదారులకు ఉపాధి కల్పించాలన్న నీళ్లు చాలా అవసరమని తెలిపారు. నీళ్లు అందించడానికి నిర్మాణాలు చేపట్టిన ప్రాజెక్టులకు ఎందుకు నిధులు కేటాయించి పూర్తి చేయడం లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సంవత్సరాలు గడిచిన చిన్ననీటి కాలువలను కూడా పూర్తి చేయలేని పాలక పార్టీల అసమర్ధత కొనసాగుతుందని విమర్శించారు. ప్రజల స్థితిగతులు మార్పులు రావాలన్న, ఆర్థికంగా బలపడాలన్న, విద్యా, వైద్యపరంగా ముందుకు పోవాలన్నా ఉపాధి కీలకమని తెలిపారు. ప్రభుత్వాలు ఇప్పుడు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాల వల్ల అందరికీ ఉద్యోగాలు వచ్చే పరిస్థితులు లేనందున కనీసం నీటి వసతన్న కల్పిస్తే వ్యవసాయం అభివృద్ధి చెందితే నిరుద్యోగ సమస్య కూడా కొంతమేరకు పరిష్కారమయ్యే అవకాశం ఉందని అందుకు పాలకులు చిత్తశుద్ధితో యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్మాణం చేపట్టిన ప్రాజెక్టులను, కాలు వలను పూర్తి చేయడానికి తక్షణం నిధులు కేటాయి ంచి పూర్తి చేయాలని అన్నారు. పెండింగులో ఉన్న ప్రాజెక్టులకు, కాలువలకు నిధులు కేటాయించాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 29, 30, 31 తేదీల్లో భువనగిరి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం నుండి హైదరాబాదు లోని ఇంద్రపార్క్ ధర్నా చౌకు వరకు పాదయాత్ర మరియు 31న నిర్వహిస్తున్న మహాధర్నాలో ప్రజలు, రైతులు వ్యవసాయ కూలీలు, వృత్తిదారులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని నర్సింహ కోరారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, మండల కార్యదర్శి పల్లెర్ల అంజయ్య, మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండ అశోక్, కొండమడుగు నాగమణి, శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ, సభ్యులు కొండ లక్ష్మయ్య, కాసారపు మల్లయ్య, కూకుట్ల చొక్కాకుమారి తదితరులు పాల్గొన్నారు.

## 1వ వార్డులో సర్ - 2026 ఓటరు జాబితా సవరణపై సమగ్ర విచారణ చేపట్టాలి

**నకిరేకల్–ఆగస్టు 20( సత్య నిష్ఠ):** నకిరేకల్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో SIR–2026 ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో బిఎల్ఓతో కుమ్మక్కై తప్పుడు చిరునామాల ఆధారంగా ఓటర్ల బదిలీలు జరిగాయనే ఆరోపణలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయని పలువురు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై భారత ఎన్నికల సంఘం వెంటనే సమగ్ర విచారణ చేపట్టి, ఇంటింటి సర్వే నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని వారు డిమాండ్ చేశారు. అర్హులైన ఓటర్లకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవడంతో పాటు, అక్రమాలకు పాల్పడిన అధికారులు లేదా బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని కోరారు. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటరు జాబితా పవిత్రతను కాపాడేందుకు పారదర్శక విచారణ నిర్వహించి బాధితులకు న్యాయం చేయాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# రేపటి పౌరుడు... నేరాల బాటలోనా?

**బాల్యం బాట తప్పితే... భవిష్యత్తు ప్రమాదకరం.!**

నల్లగొండ-ఆగస్టు 20( సత్య నిష్ఠ )
(గడగోజు రవీంద్రాచారి.9848772232)

నేటి సమాజం తీవ్రమైన అంతర్మథనంలో ఉంది. చదువుకొని నలుగురికి ఆదర్శంగా నిలవాల్సిన చేతులు నేరాలకు పాల్పడుతున్నాయి. అక్షరాలు దిద్దాల్సిన వయసులో ఆయుధాలు పడుతున్నాయి. తప్పు చేస్తే తెలుసుకుని సరిదిద్దుకోవాల్సిన బాల్యం.. క్షణికావేశం, చెడు సాంగత్యం, మత్తుపదార్థాలు, చరవాణి వ్యసనం, సామాజిక మాధ్యమాల ప్రభావంతో బాట తప్పుతోంది. ఇది ఒకటి రెండు ఘటనలకు పరిమితమైన సమస్య కాదు. రేపటి సమాజం ఎలా ఉండబోతోందన్న ఆందోళన కలిగించే పరిణామం. నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయురాలిపై పదో తరగతి ఇద్దరు విద్యార్థులే దాడికి పాల్పడిన ఘటనతోపాటు, వివిధ ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు, హత్యలు, దాడులు వంటి నేరాల్లో విద్యార్థులు, యువత పట్టుబడుతున్న తీరు పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. చిన్న గొడవలకు ప్రతీకారం తీర్చుకోవడం, క్షణికావేశంలో ప్రాణాల మీదకు తెచ్చుకోవడం, తల్లిదండ్రులనే ఎదిరించడం వంటి ఘటనలు బాల్యం ఏ దిశగా పయనిస్తోందో ప్రశ్నిస్తున్నాయి.

ఒకప్పుడు ఉపాధ్యాయుడు అంటే పాఠాలు చెప్పే వ్యక్తి మాత్రమే కాదు.. విద్యార్థి జీవితానికి దిశానిర్దేశం చేసే మార్గదర్శి. గురువు ప్రతి విద్యార్థిని తన బిడ్డలా భావించి, తప్పు చేసినప్పుడు మందలించి, అవసరమైతే కఠినంగా హెచ్చరించి, సరైన దారిలో నడిపించేవారు. ఆ మందలింపులో కసి కాదు.. భవిష్యత్తుపై బాధ్యత ఉండేది. శిల్పి రాయిని చెక్కిన ప్రతి దెబ్బతో అందమైన రూపాన్ని ఆవిష్కరించినట్లే.. గురువు చెప్పే ప్రతి మాట విద్యార్థి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేది. క్రమశిక్షణలో పెరిగిన బాల్యం బాధ్యతాయుతమైన పౌరుడిగా ఎదుగుతుందనే నమ్మకం ఉండేది. అందుకే గురువు పట్ల గౌరవం ఉండేది. రాను రాను ఆ పరిస్థితి మారుతోంది. ఉపాధ్యాయుల పట్ల గౌరవం తగ్గడమే కాదు.. కొన్ని సందర్భాల్లో ద్వేషం, ప్రతీకార భావన పెరుగుతున్నాయి.

ఈ మార్పు ఉపాధ్యాయులకే పరిమితం కాదు. తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు, చివరకు సమాజంలోని వివిధ వర్గాల మధ్య కూడా పరస్పర గౌరవం తగ్గుతున్న తీరు కనిపిస్తోంది. చిన్న విమర్శను అవమానంగా భావించడం, తప్పును అంగీకరించకపోవడం, ప్రశ్నిస్తే ఎదురు తిరగడం పెరుగుతున్నాయి. పిల్లలు సమాజాన్ని చూసే నేర్చుకుంటారు. ఇంట్లో పెద్దలు పరస్పరం గౌరవించుకోకపోతే పిల్లలకు గౌరవం ఎలా నేర్పగలం? కుటుంబంలో సంభాషణ తగ్గి, చరవాణితో అనుబంధం పెరిగితే విలువలు ఎలా బలపడతాయి?

క్రమశిక్షణ శిక్ష కాదు.. తప్పును సరిదిద్దడం ద్వేషం కాదు. విద్యార్థులపై శారీరక, మానసిక హింసకు ఎట్టి పరిస్థితుల్లోనూ అవకాశం ఉండకూడదు. అదే సమయంలో తప్పు చేసిన విద్యార్థిని సరైన పద్ధతిలో మందలించి, ఆ తప్పు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయుడికి ఉండాలి. ఉపాధ్యాయుడికి కొట్టే హక్కు ఉండకూడదు.. కానీ తప్పును సరిదిద్దే హక్కు, క్రమశిక్షణ నేర్పే బాధ్యత మాత్రం ఉండాలి. చట్టాలు పిల్లలను రక్షించాలి.. ఉపాధ్యాయుల బాధ్యతను నిర్వీర్యం చేయకూడదు. కౌన్సెలింగ్, తల్లిదండ్రుల సమావేశాలు, ప్రవర్తనా మార్గదర్శనం వంటి హింసకు తావులేని పద్ధతులను బలోపేతం చేయాలి.

ఇటీవల రూపారెడ్డి హత్య ఘటన తర్వాత ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, లెక్చరర్లలో భద్రతపై ఆందోళన వ్యక్తమవుతోంది. "విద్యార్థిని మందలించడానికి కూడా భయపడాల్సిన పరిస్థితి వస్తే.. ఇక విద్యాబోధన ఎలా సాగాలి?" అనే చర్చ ఎక్కడ చూసినా వినిపిస్తోంది. వైద్యులు, ఇతర వృత్తుల వారికి కొన్ని సందర్భాల్లో రక్షణ, భద్రతకు సంబంధించిన చట్టపరమైన వ్యవస్థలు ఉన్నప్పుడు.. విద్యాబోధనలో కీలక పాత్ర పోషించే ఉపాధ్యాయులు, అధ్యాపకుల భద్రతపైనా ప్రభుత్వం ఆలోచించాల్సిన అవసరం ఉంది. అయితే రక్షణ పేరుతో విద్యార్థులపై కఠినత్వానికి అనుమతి ఇవ్వడం కాదు.. విధి నిర్వహణలో ఉన్న ఉపాధ్యాయులకు భద్రత, గౌరవం కల్పించడమే లక్ష్యం కావాలి. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ అంశంపై బాధ్యతాయుతంగా ప్రభుత్వంతో చర్చించి, చట్టబద్ధమైన రక్షణ కోసం కృషి చేయాలి.

తల్లిదండ్రుల పాత్ర కూడా అంతే కీలకం. పిల్లలను ప్రేమించాలి.. కానీ ప్రేమ పేరుతో క్రమశిక్షణను చంపకూడదు. అడిగిన ప్రతిదీ కొనివ్వడం, తప్పు చేసినా వెనకేసుకురావడం, ప్రతి చర్యను సమర్థించడం ప్రేమ కాదు. "నా పిల్లవాడు తప్పు చేయడు" అనే అంధ నమ్మకం కంటే.. "నా పిల్లవాడు తప్పు చేస్తే నేను సరిదిద్దుతాను" అనే ఆలోచన అవసరం. తల్లిదండ్రులు ప్రశ్నించడానికి భయపడితే.. ఉపాధ్యాయులు మందలించడానికి వెనుకాడితే..పిల్లలను సక్రమ మార్గంలో నడిపించేది ఎవరు? హక్కులతో పాటు బాధ్యతలు, స్వేచ్ఛతో పాటు పరిమితులు నేర్పాలి.

విద్య కూడా మార్కులు, ర్యాంకులు, ఉద్యోగాలకే పరిమితం కాకూడదు. విద్యార్థి ఎంత మార్కులు సాధించాడన్నదే కాదు.. ఎంత మంచి మనిషిగా ఎదిగాడు? ఎదుటివారిని ఎంత గౌరవిస్తున్నాడు? కోపాన్ని ఎలా నియంత్రించుకుంటున్నాడు? ఓటమిని ఎలా స్వీకరిస్తున్నాడు? సమాజం పట్ల ఎంత బాధ్యతగా ఉన్నాడు? మహిళలను, తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను, ఇతరులను ఎంత గౌరవిస్తున్నాడు? చట్టాల పట్ల ఎంత అవగాహన కలిగి ఉన్నాడు? అనే అంశాలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. మార్కులు జీవితానికి అవసరమే.. కానీ మనిషితనం లేని విద్య సమాజానికి ఉపయోగపడదు.

అందుకే ప్రాథమిక విద్య నుంచే పిల్లలకు చట్టాలపై, నేరాల పర్యవసానాలపై, పౌర బాధ్యతలపై, కుటుంబ విలువలపై అవగాహన కల్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, మహిళలు, వృద్ధులు, తోటి విద్యార్థుల పట్ల గౌరవం నేర్పాలి. మత్తుపదార్థాల దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, సామాజిక మాధ్యమాల వినియోగం, వ్యక్తిగత భద్రత, జీవన నైపుణ్యాలు వంటి అంశాలను క్రమంగా బోధించాలి. అవసరమైతే ప్రత్యేకంగా ఒక పీరియడ్ కేటాయించి ప్రతి తరగతిలో జీవన విలువలు, చట్ట పరిజ్ఞానం, సామాజిక బాధ్యతపై బోధన నిర్వహించాలి. నెలకు ఒకసారి పోలీసు అధికారులు, న్యాయ నిపుణులు, వైద్యులు, మానసిక నిపుణులు, సామాజిక కార్యకర్తలతో అవగాహన సదస్సులు, సెమినార్లు నిర్వహించడం ఉపయోగకరం.

అరిచేతిలో ప్రపంచాన్ని చూపిస్తున్న చరవాణి, సామాజిక మాధ్యమాలు, యూట్యూబ్, సినిమాలు, సీరియళ్లు కూడా బాల్యంపై ప్రభావం చూపుతున్నాయి. సాంకేతికతను పూర్తిగా దూరం చేయడం సాధ్యం కాదు.. అవసరమూ లేదు. కానీ దాని వినియోగంపై పరిమితులు ఉండాలి. హింస, నేరాలు, అసభ్యకర కంటెంట్, ప్రమాదకర సవాళ్లను సంచలనాత్మకంగా చూపించే ధోరణిపై బాధ్యతాయుతమైన నియంత్రణ అవసరం. నేరాన్ని ఎలా చేయాలి? ఎలా తప్పించుకోవాలి? అనే విషయాలను వినోదం పేరుతో చూపించే కంటెంట్ పిల్లలపై ఎలాంటి ప్రభావం చూపుతుందో పరిశీలించాలి. సాంకేతికత భవిష్యత్తును నిర్మించాలి.. నేరాలకు బాట వేయకూడదు.

మత్తుపదార్థాల ముప్పు మరింత ప్రమాదకరం. గంజాయి, మద్యం వంటి వాటికి విద్యార్థులు, యువత బానిస కాకుండా కఠిన చర్యలు అవసరం. పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో సరఫరా, విక్రయాలపై నిఘా పెంచాలి. విద్యార్థులకు వాటి వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను చిన్న వయసు నుంచే అర్థమయ్యే భాషలో వివరించాలి. వ్యసనానికి లోనైన వారిని అవసరమైన చోట వైద్య, మానసిక సహాయంతో సాధారణ జీవితంలోకి తీసుకురావాలి.

పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను కూడా నిర్లక్ష్యం చేయకూడదు. అకస్మాత్తుగా కోపం పెరగడం, చదువుపై ఆసక్తి తగ్గడం, ఇంట్లో మాట్లాడకపోవడం, అనుమానాస్పద స్నేహాలు, అధికంగా డబ్బు అడగడం, చరవాణి వినియోగం పెరగడం వంటి మార్పులను గమనించాలి. ప్రతి మార్పు నేరానికి సంకేతం కాకపోవచ్చు. కానీ ప్రతి మార్పు పిల్లతో మాట్లాడాల్సిన అవసరాన్ని సూచిస్తుంది. నిఘా కంటే నమ్మకంతో కూడిన సంభాషణ ముఖ్యం. ఒక గంట పిల్లతో మన స్ఫూర్తిగా మాట్లాడటం.. రేపు పోలీస్‌స్టేషన్ ముందు గడపాల్సిన ఎన్నో గంటలను తప్పించవచ్చు.

పిల్లలకు క్రీడా మైదానాలు, గ్రంథాలయాలు, కళలు, సృజనాత్మక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు అందుబాటులో ఉండాలి. ఖాళీ సమయం చెడు సాంగత్యానికి వేదిక కాకుండా చూడాలి. నేరం జరిగిన తర్వాత శిక్షించడం అవసరమే.. కానీ నేరానికి దారితీసే కారణాలను ముందే గుర్తించి అడ్డుకోవడం మరింత ముఖ్యం. బాలల తప్పు వెనుక కారణాన్ని తెలుసుకుని అవసరమైన చోట కౌన్సెలింగ్, కుటుంబ సహకారం, నిపుణుల సూచనలు అందించాలి. శిక్ష భయం తాత్కాలికంగా నేరాన్ని ఆపవచ్చు.. విలువలతో కూడిన వ్యక్తిత్వం మాత్రం నేరం వైపు అడుగు పడకుండా చేస్తుంది.

రేపటి పౌరుడిని తీర్చిదిద్దే బాధ్యతను కుటుంబం, పాఠశాల, ప్రభుత్వం, పోలీసులు, సమాజం కలిసి మోయాలి. పాఠశాలలో పుస్తకం చేతిలో పెట్టినంత మాత్రాన విద్య పూర్తికాదు. ఇంట్లో సౌకర్యాలు కల్పించినంత మాత్రాన పెంపకం పూర్తికాదు. పిల్లలకు పుస్తకం కావాలి.. కానీ పుస్తకంతో పాటు విలువలు కావాలి. స్వేచ్ఛ కావాలి.. కానీ దానికి తోడు బాధ్యత కావాలి. హక్కులు కావాలి.. కానీ వాటితో పాటు కర్తవ్యాలు కూడా కావాలి.

కలం పట్టిన చేయి కత్తి పట్టకూడదు. కలలు కనే కళ్లు నేరాల వైపు చూడకూడదు. గురువును గౌరవించే సంస్కారం, తల్లిదండ్రుల మాట వినే బాధ్యత, మహిళల పట్ల గౌరవం, సమాజం పట్ల స్పందించే మనసు, చట్టాన్ని గౌరవించే ఆలోచన బాల్యంలోనే నాటాలి. నేరం చేసిన తర్వాత ఒకరిని మార్చడం కష్టం. కానీ నేరం వైపు అడుగు వేయకముందే ఒక బాలుడిని సరైన దారిలో నడిపించడం సాధ్యమే.

మార్కుల యంత్రాలను కాదు.. మానవత్వం ఉన్న పౌరులను తయారు చేయాలి.

భయంతో క్రమశిక్షణ కాదు.. బాధ్యతతో కూడిన క్రమశిక్షణ కావాలి.

తప్పును దాచే ప్రేమ కాదు.. తప్పును సరిదిద్దే ప్రేమ కావాలి.

నేరం తర్వాత స్పందించే సమాజం కాదు.. నేరానికి ముందే అప్రమత్తమయ్యే సమాజం కావాలి.

ఈ రోజు పిల్లల కోసం కేటాయించే సమయం.. రేపటి సమాజానికి పెట్టుబడి. ఈ రోజు నేర్పే ఒక మంచి మాట.. రేపు ఒక ప్రాణాన్ని కాపాడవచ్చు. ఈ రోజు ఆపే ఒక చెడు అలవాటు.. రేపు ఒక కుటుంబాన్ని కాపాడవచ్చు.

బాల్యం బాట తప్పితే భవిష్యత్తు బాట తప్పుతుంది. బాల్యాన్ని కాపాడితేనే రేపటి పౌరుడిని కాపాడినట్టవుతుంది.

రేపటి పౌరుడిని కాపాడితేనే.. రేపటి సమాజాన్ని కాపాడినట్టవుతుంది. అందుకే బాల్యం నుంచే భవిష్యత్తుకు పునాది వేయాలి..



గడగోజు రవీంద్రాచారి
9848772232